14th May, 2019

# Padala Charitable Trust (PCT)

## పదవ **తరగతి ఫలితాలు – స్పందన**

**పదవ తరగతి** పరీక్షలలో విజయం సాధించిన (సాధించాం అనే భ్రమలో ఉన్న) మన విద్యార్థులకు, తల్లితండ్రులుకు, ఉపాధ్యాయులకు మరియు విద్యాశాఖాధికారులకు.. అందరికీ కూడా అభినందనలు.

### **విద్యార్థులకు మనవి:**

మీ జీవితం లో ఒక మెట్టు ఎక్కేశారు. అయితే మీ పదవ తరగతి సర్టిఫికేట్ చూసుకున్నప్పుడల్లా అందులో మీ కష్టం కనిపిస్తుందో పక్కన కూర్చున్న వాడి ముఖం కనిపిస్తుందో, ఇన్విజిలేటర్ ముఖం కనిపిస్తుందో ఒక్కసారి ఆలోచించుకోండి. ఇక ముందు మీ కష్టం మాత్రమే మీ వెంట వస్తుంది.

పదవ తరగతి లో వచ్చిన గ్రేడు ని చూసుకుని సంబరపడిపోవడం కానీ , దిగులుపడిపోవడం కానీ చేయకుండా దాన్ని మర్చిపోయి తరువాత సంగతి ఆలోచించండి. మీకు నచ్చిన రంగాన్ని మాత్రమే ఎంచుకోండి. మీ కెరీర్ విషయంలో ఎలాంటి సందేహాలున్నా , సలహాలు కావాలన్నా మమ్మల్ని సంప్రదించండి.(Project SETHU- A bridge for your Career; 9441114167, 7989034586)

అలాగే పదవ తరగతి పాస్ కాని విద్యార్థులు ఏమీ దిగులు చెందవద్దు **(failure is an event, not a person).** మీకు ఇంకా చాలా అవకాశాలు ఉన్నాయి. చాలా మార్గాలు ఉన్నాయి. మీలో కొందరు ఈరోజు పదికి కి పది మార్కులు వచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగవచ్చు. ఈ విషయంలో మీకు ఎటువంటి మోటివేషన్ కావాలన్నా, కౌన్సిలింగ్ కావాలన్నా మా దగ్గరకి రావొచ్చు.

### **తల్లిదండ్రులకు మనవి :**

మీ పిల్లలకు వచ్చిన మార్కుల లో ఎంత **నిజాయితీ** ఉందో మీకు తెలుసు. వాటిని దృష్టిలో ఉంచుకుని మీ పిల్లల పై అతిగా అంచనాలు పెట్టుకోవద్దు. అదే విధం గా గ్రేడ్లు సరిగా రాలేదని వారిని తక్కువ చేసి చూడొద్దు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుంది. మీ అమ్మాయి/ అబ్బాయి ప్రతిభ ఏంటో మీరే గుర్తించి ప్రోత్సహించండి. ముఖ్యంగా ఆడపిల్లల చదువు ఆపొద్దు. మీకు ఆర్థిక ఇబ్బందులు ఏమైనా ఉంటే మా లాంటి సంస్థలు scholarships ఇచ్చి చదివిస్తాయి.

మన పిల్లలే మన ఆస్తి. వారికి కావాల్సిన సమయం ఇద్దాం. వారు చెప్పేది శ్రద్ధగా విందాం.

14th May, 2019

**మరో విషయం :**

తమ పాఠశాలలో పదికి పది గ్రేడులు, పాస్ పర్సంటేజ్ గురించి అనౌన్స్ చేసుకుంటుంటున్న కొంతమంది ప్రధానోపాధ్యాయులు మాతో అంటున్న మాటలు " నిజానికి మాకు ఈ ఫలితాలు ఎటువంటి ఆనందాన్ని ఇవ్వటం లేదు. వ్యవస్థ లోని అన్ని స్థాయిల్లో పేరుకుపోయిన నిర్లక్ష్యం, అక్రమాల మూలంగా మేము పిల్లలకు సరైన విద్యను అందించి సమాజానికి ఇవ్వలేకపోతున్నాం. కేవలం మా **మనుగడ(survival)** కోసం మాత్రమే తాపత్రయ పడాల్సి వస్తుంది. ఈ పరిస్థితి వచ్చినందుకు సిగ్గుపడుతున్నాం".

వాస్తవాన్ని ఒప్పుకుంటూ మార్పు కోసం ఆరాటపడుతున్న ప్రతీ ఒక్కరికీ పాదాభివందనాలు. మార్పు తప్పకుండా వస్తుంది. ఎవరి పరిధిలో వారు నిజాయితీగా ప్రయత్నం చేద్దాం. ముఖ్యం గా విద్యార్థులకు, తల్లిదండ్రులకు నిజమైన విద్య మీద అవగాహన రావాల్సిన అవసరం చాలా ఉంది.

**విద్యాశాఖాధికారులకు మనవి:**

ఇక చివరగా మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి విద్యాశాఖాధికారులకు మనవి. ఒక మండలం అంతా 100% పాస్ అవ్వడం ఎక్కడా చూడని చోద్యం. ఇది మన దగ్గరే జరిగింది. వందల కొద్దీ 10/10 గ్రేడులు, 90 కన్నా ఎక్కువ పాస్ పర్సంటేజ్ అనేది కేవలం కలల్లో, సినిమాల్లో మాత్రమే సాధ్యం. వీటికోసం ప్రయివేట్ విద్యా సంస్థలు ఎందుకు ప్రాకులాడతాయో మీకు కూడా తెలుసు.

ఆ నంబర్ గేమ్ లో సంబరాలు చేసుకోవాల్సిన అవసరం లేదని మా అభిప్రాయం. వీటి మీద ఫోకస్ తగ్గించి, ఎవరికీ పనికిరాని టార్గెట్స్ తో ఉపాధ్యాయులను అతి ఒత్తిడికి గురిచేసే దుష్ట సాంప్రదాయానికి స్వస్తి చెప్పాల్సిన అవసరం ఆసన్నమైంది. తల్లిదండ్రుల లో కూడా నెమ్మదిగా ఈ విషయం మీద అవగాహన పెరుగుతుంది. పాఠశాల స్థాయిలో జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, కెరీర్ గైడెన్స్ లాంటి విషయాల మీద దృష్టి మరల్చాలి. భావి తరానికి విలువల మార్గం చూపించాలి. అదే మనందరం కలిసి ఈ సమాజానికి, దేశానికి చేసే నిజమైన, అసలైన సేవ.

**– పడాల చారిటబుల్ ట్రస్ట్(PCT), కాకినాడ.**

---

Padala Surya Prasad (Founder & Mentor PCT)

Mobile: +91 73311 23044 Email: padalasurya@yahoo.com

http://padalacharitabletrust.org/